# 'వల్లరి' కాటు

చీకటి...

చీకటి చిరుతపులిలా గూడెంమీదపడి వీర విహారం చేస్తూంది.

మొత్తం ఓముప్పై గుడిసెలున్న ఆ గూడేనికి రెండే బజార్లున్నాయి. ఆరెండు బజార్లకడ్డంగా' గౌరాబానికి దారి. అక్కడేగూడెంచౌరస్తా! జడలు విరబోసుకున్న మర్రి ఒకటి అక్కడ రాక్షసిలా నిలబడివుంది.

ఎప్పుడో —

ఒకనాటి శుభముహూర్తాన ఆ మర్రిచెట్టు చుట్టూ గద్దె కట్టించేరు. అక్కడే పంచాయితీలు జరిగేది. పెద్దలంతా ఆగద్దెమీద కూచుంటారపుడు!

ప్రస్తుతం—

ఊరకుక్కొకటి గద్దెపక్కనే పడుకొని అరుస్తోంది .. గూడెంలోవున్నందుకు తనవంతు కర్తవ్యంగా.. ఏ జీవి అటువచ్చినా అరవటం అలవాటు దానికి!

అక్షరలేని.. అర్థంకాని సన్నాయి వాయిద్యపు గోలలా కీచురాళ్ళ అరుపులు...

ఓ గుడిసెలోంచి — సన్నని మూలుగులు ... మధ్యమధ్యా నిట్టూర్పులూ... వినిపిస్తున్నాయి. పంచాయితీ గద్దెకు పదిగజాలదూరంలో వుందా గుడిసె

గుండెలనిండా బరువు నింపుకొని 'మాంగ్యా' గుడిసెముందున్నకుక్కిమంచంలోకూర్చొన్నాడు. మాంగ్యా చుట్టూ — రావులా—సౌగయ్యా—బిక్యా—ఓదేలూ కూర్చునివున్నారు.

గుడిసెలో గుడ్డిదీపం నెప్పులు పడుతోన్నట్టు బాధగా మెలికలు తిరుగుతోంది. ఆ దీపం ఆరిపోకూడదని మాంగ్యా వెయ్యిదేవుళ్ళకు మొక్కుకుంటున్నాడు. దీపంలో తన 'లచ్చిమి'ని చూసుకొంటున్నాడు.

గుడిసెలోంచి లచ్చిమి మూలుగు వినిపిస్తోంది. లచ్చిమి నులకమంచంలో మెలికలు తిరుగుతోంది. మంచంప్రక్కన మంత్రసాని మైసమ్మ కూర్చుని వుంది. లచ్చిమి తల్లీ— బిక్యా అక్కా—కూడా వున్నారక్కడ.

అర్థరాత్రి దాటుతోంది—

పదినెలల రూపానికి ఊపిరిపోసుకుని.. బయటిప్రపంచంలోకి అడుగుపెట్టాలని ప్రయత్నిస్తోందో ప్రాణి!





లచ్చిమి మూలుగులు పెరిగేయి. నొప్పులు తీవ్రంగా వస్తున్నాయి.

"అమ్మో... అయ్యో... అ... అ...మో...మ్మో...హూ..." అందరికుండెల్లో అలజడి పెరిగింది!

* * *

రోజూలానే– లచ్చిమి, మరికొందరు గూడెం ఆడవాళ్ళు కట్టెపుల్లలు తెచ్చుకోవడానికి అడవి కెళ్ళారు.

ఎక్కడినుండో– చౌకీదార్ వూడిపడ్డాడు. అంతే– అందరూ పరుగందుకున్నారు. లచ్చిమి పడుతూలేస్తూనేవున్నా– చౌకీదార్ చేతికి చిక్కింది. తన రెండుచేతుల్తో లచ్చిమిని గట్టిగా పట్టుకున్నాడు చౌకీదార్.

భయం– భయంకరంగాఆవరించిందిలచ్చిమిని...

లచ్చిమికీ– మాంగ్యాకూ మనువైన నెల్లాళ్ళ తరువాత ఇదేమొదటిసారి అడవికి రావటం. ధైర్యంకూడగట్టుకొని లచ్చిమి బ్రతిమాలుతోంది.

"దొర... దండం బెడత... తప్పైనాద్దొర... యింగెప్పుడురాను" లచ్చిమి మొహం దీనంగా వుంది.

చౌకీదార్ నల్లటికళ్ళు అద్దాల మాటునుండి కర్కశంగా లచ్చిమిని చూస్తోన్నాడు. పదునెనిమిది పరువాలుమోసే లచ్చిమి పక్వానికొచ్చిన జాంపండులా వుంటుంది. చౌకీదార్ వెకిలిచూపు బయటికి కనబడ్డంలేదు!

"నీ మిండడి దనుకున్నావే జంగల్! సర్కారోల్ల జగల్లకొచ్చి గాపుల్లలుతీస్కపోవద్దని ఎన్నిసార్లు చెప్తవే...! ఛలో టేషన్‌కు ...అడనే నీత ప్పేందిదో సూపిస్త... మాదర్‌ఛోద్...నకు సుందాల్లనడూ..." అంటూ లచ్చిమి జబ్బపట్టుకొని ముందుకు తోసేడు చౌకీదార్.

ఆ తోపుకు క్రిందపడ్డ లచ్చిమి గిలాగిలాతన్నుకుంది.

"లేసీయమ్మ–లే! నక్రాల్జేస్తన్నావే. ఇగో– నాసంగతెర్కలేమల్లె– ...లేచి నడ స్తవాసరే– యేసొల్జెస్తే గొంతుపిస్క... గిడనే గోరీకడ్త" చౌకీదార్ పళ్ళికిలిస్తూ చేతగాని శూరత్వాన్ని ప్రదర్శించేడు.

లచ్చిమి బెదురు కళ్ళు భయంగాచూసేయి. కళ్ళవెంట నీళ్లు సుళ్లుతిరిగిచెక్కిళ్ళమీదికిదూకేయి. మెల్లిగాలేచి నడవటం మొదలెట్టింది.

చౌకీదార్ లచ్చిమిని కసికసిగా చూస్తోన్నాడు. దోవన పోతున్నంతసేపూ లచ్చిమి తన తప్పును క్షమించమని బ్రతిమాల్తూనేవుంది. కాని–చౌకీదార్‌కు లచ్చిమి తప్పుతో పనిలేదిప్పుడు– లచ్చిమితోనే పని...!

అప్పుడే–

పడమట కొండలతో సూర్యుడు ఆడుకొంటున్నాడు. బంగారు పూతపూసినట్లు– ఆకులన్నీ మెరుస్తోన్నాయి. చల్లగాలికి చెట్లన్నీ వూగుతోన్నాయి. పక్షులన్నీ గూళ్ళకు చేరుకుంటోన్నాయి. పశువుల మందలు ఇళ్ళకు వెళ్లాలని వేగంగా అడుగులేస్తోన్నాయి. చొక్కా– లాగూ లేని గొడ్లుకాసే పిల్లగాళ్ళు సందె కబుర్లు చెప్పుకుంటూ బుజాన గొడ్డలి సవరించుకుంటూ వెళుతోన్నారు.

మేకపిల్లను తోలుకెళుతున్న కసాయివాడిలా చౌకీదార్ లచ్చిమిని తీసుకెళుతోన్నాడు. లచ్చిమి ప్రార్థిస్తూనే చౌకీదార్ వెంటపక్క గ్రామానికి వెళ్ళింది!

* * *

తూరుపు—

మందారంలాంటి అందాల్ని ఎగజిమ్ముతోంది!

మరోదృష్టితోచూస్తే–ఎర్రని మాంసపుముద్దలా వుంది–!

ఇంకా ఆలోచిస్తే—

చెరిగిన లచ్చిమి నుదుట తిలకంలావుంది!

మౌన రోదనంవల్ల గుండెలు బరువెక్కిన లచ్చిమి పిచ్చిదానిలావుంది. రాత్రంతా రాక్షసంగా రతించిన చౌకీదార్ తెలపొద్దుజామున లచ్చిమిని అక్కడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళి హెడ్‌కానిస్టేబుల్ రంగరాజుకు అప్పగించేడు.

మరో గంటలో—

ఆదుర్దాగా అక్కడికి చేరుకున్నాడు మాంగ్యా! లచ్చిమి మౌనం తప్ప మరోటి తెలీని వెర్రిదానిలా స్తబ్దంగా వుండిపోయింది. పరిస్థితిని అంచనావేసిన మాంగ్యా హెడ్డుగారి కాళ్ళకడ్డం పడ్డాడు.

కాళ్ళు పట్టుకున్న మాంగ్యా చొక్కా పట్టుకొని లేపుతూ—

"లేరా—లే! ఇంకా ఎస్సైగారురాలె...యస్సైన వొస్తే—తోలువొలు స్తను—నీకాగతి పట్టది" అంటూ హెడ్డుగారు చెప్పేరు. హెడ్డుగారు మహా ఇదై పోయేరు! కారణం లేకపోలేదు— నోటిదాకావచ్చిన జాంపండు జారిపోతోందని! కాని గూడెంవాళ్ళ నమ్మదగ్గ మనుషులు కాదు!

అందుకే పదో పాతికో పట్టుకొని వదిలేద్దామని. తన దొడ్డ మనసుకు జాలేసినట్టు మాంగ్యా చెవి దగ్గరగావచ్చి "గీడ—కేసేంలేకుండజేయాల్నంటే. యాభై రూపాయిలైద్ది— లేవే —లే! ముంగ్దాల యాభై గిడపెడ్తే—ఇగ బైటికి తోల్త—" చెప్పేడు పాపం ఓ యాభైతో సరిపెట్టుకుందామని...

"దొర...తప్పైనాదొర—యింగెప్పడు జంగల్ల కాలుబెట్టందొర...యియ్యాల కాదుగనీ...రేపెల్లుండిల మీ యాభై మీకిస్తదొర...యింగొఓలపెట్టర్దొరా" ఎన్నోరకాలుగా ప్రార్థిస్తున్నాడుమాంగ్యా.

మళ్ళీ వంగి కాళ్ళు పట్టుకొన్నాడు మాంగ్యా. నాలుగు పిడిగుద్దులతో పైకిలేపి దవడ పగిలిపోయేలా కొట్టేడు హెడ్డు.

"ఏంబే! కళ్లు నెత్తినెక్కినాయిర!... బొక్క చీరి బొక్కలోతోస్త...! ఏమనుకొన్నావొబిడ్డ... మల్లిజెప్తున్న ఇగ గంటైతే యస్సైగారొస్తరు. అటంక నాకెర్కలే... ఇగబో..." అంటూ మెట్ల మీదనుండి క్రిందకి తోసేడు రంగరాజు.

ఇక ప్రార్థనలవల్ల తన లచ్చిమికి విముక్తి రాదని తెలుసుకున్న మాంగ్యా తనపాట్లేవో తను పడటానికి బయల్దేరేడు. తన లేగదూడను షావుకారు సుబ్బయ్యకు తాకట్టుపెట్టి— డబ్బు తెచ్చి— హెడ్డుగారికి సమర్పించుకొన్నాడు.

ముసిముసిగా నవ్వుకుంటూ డబ్బు జేబులో తీసుకున్న హెడ్డుగారు "నీతాతగాడిదనుకున్నావ్‌బే—జంగల్. మల్లెప్పుడన్న జంగల్ల కదుగుబెట్టినవా— మెక్కలిరగ్గదన్ని బొక్కలదొస్త!" అని హెచ్చరించిన హెచ్చరిక చేసి—త్రీనాట్‌వన్‌కానిస్టేబుల్‌తో లచ్చిమిని, మాంగ్యాను బయటికి పంపించేసేడు.

మర్నాటిదాకారాని యస్సైగారి పుణ్యమా అని తనకోనలభై – 301కో పది దొరికేయి.

పోలీస్‌స్టేషనునుంచి బయటపడిన లచ్చిమి మౌనంగా మాంగ్యా వెనక నడుస్తోంది—

వాడిన కుసుమం కురులనుండి మెల్లిగా జారుతున్నట్టు...!

* * *

గుడిసెకు చేరుకున్న లచ్చిమి – మాంగ్యా గుండెల్లో తలదాచుకొని వెక్కివెక్కి ఏడ్చింది. ఓదార్చేడు మాంగ్యా!

కూటికీ—కులానికీ పేదైనా మాంగ్యా హృదయం సముద్రమంత విశాలమైనది. ఎన్నోబాధల—కష్టాల అలల్ని దిగమ్రింగగలదు. అదే—మాంగ్యా చిన్నజీవితం నేర్చుకొన్న విశాలభావాలకు నిదర్శనం!

మాంగ్యాకూడా మనిషేకనక— ఎంత ఉదాత్త స్వభావుడైనా— కులీన సంప్రదాయాల్ని అనుసరించక— తప్పు ఎవరివల్ల జరిగినా లచ్చిమికే వోచిన్న శిక్ష విధించేడు. ఆచారాలు కట్టుబాట్ల పేరుతో సంఘం అనాదిగా స్త్రీకిచేస్తోన్న అన్యాయం ఇదే!

కానీ మాంగ్యా విధించిన శిక్ష తాత్కాలికమే! అప్పటినుండి లచ్చిమి గుడిసెలో— తను గుడిసె బయట తొంగోవాలి! ఈశిక్షలోని అంతర్యం—అంతరార్థం అతని హృదయంకే తెలుసు! శిక్షాకాలం ఏడాది!

ఏడాది రోజులు—

నెలలు—క్షణాలుగా కాకపోయినా రోజుల్లా దొర్లిపోయేయి.

ప్రస్తుతం ఇది—

లచ్చి కడుపులో పెరుగుతోన్న చౌకీదార్ రూపం బయటపడాల్సిన సమయం...

ఇంకా కొన్నిక్షణాల్లో ఆ పాపానికి ప్రతిఫలం..

* * *

మాంగ్యా కళ్ళముందు— గతం గంతులేస్తూ కదిలి— ఓక్షణంలో జారిపోయింది!

మాంగ్యా మాట్లాడ్డంలేదు. ప్రక్కనున్నవాళ్లు— మాంగ్యాను కుదిపేడు. మనసు మూలల్నించి గతస్మృతుల్ని తరిమేసి— వర్తమానంలోకి వచ్చి పడ్డాడు మాంగ్యా!

"పిల్లోడురా!" పిడుగుపడ్డట్టు అందరూ ఒక్కసారి ముక్తకంఠంతో అన్నారు.

ఇంతలో— మంత్రసాని మైసమ్మ పెద్దగా ఏడుపులా సోకం పెట్టడంతో అందరూ— ఆదుర్దాగా గుడిసెలోకి జొరబడ్డారు.

అంతే! లచ్చిమి— శాశ్వతంగా మాంగ్యానుంచి శెలవు తీసుకుంది! ప్రక్కనున్న పిల్లాడు గుక్కపట్టి ఏడుస్తొన్నాడు.

పిల్లాడు...

పిల్లాడిలో చౌకీదార్‌రూపం కళ్ళముందు కదిలింది!

తనజీవితాన్ని నాశనంచేసిన చౌకీదార్...

తన లచ్చిమిని తనకుకాకుండాచేసినచౌకీదార్..

పచ్చని తమబ్రతుకుల్లో నిప్పులుపోసిన చౌకీదార్ ..

చౌకీదార్... ముస్తఫా... !

మాంగ్యా పిడికిళ్ళు బిగుసుకున్నాయి. ప్రక్కనున్నవాళ్ళ వ్యాఖ్యాల్ని— వాళ్ళని పట్టించుకోలేదు. క్షణంలో మెరుపులాంటాలోచన...

తన లచ్చిమి జీవితాన్ని అమానుషంగా— అన్యాయంగా— నిర్దాక్షిణ్యంగా కాటువేసి బలిగొన్న చౌకీదార్ ముస్తఫా...

మాంగ్యా మెదడులో మెరుపులు— ఉరుములు..

పొత్తిళ్ళ పిల్లాడ్ని ఎత్తుకొని వొక్క వుదుటున పరుగందుకొన్నాడు— ఊరికి ఉత్తరంగావున్న అడవిలోకి...

కదంత్రొక్కిన కోడెనాగులా బుసలుకొడ్తూ కటికచీకటినుండి — కాంతిరేఖకోసం...!

గుడిసెలో గుడ్డిదీపం ఆరిపోయింది!

గూడెంలో ఇంకాచీకటి...

అంతా చీకటి...

చీకటి... !!

మాంగ్యా మనసులో మాత్రం— వెలుగురేఖ. అదే— క్రాంతిరేఖ !!! *

